క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పాలకొండ రూరల్: మండల సర్వసభ్య సమావేశంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీఓ జె.ఉమా మహేశ్వరి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండల పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

రథయాత్రకు పోటెత్తిన భక్తులు



యాత్రలో పాల్గొన్న భక్తులు

పాలకొండ: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. రథంపై ఉన్న జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి పిన్నమ్మ గుడి నుంచి రథాన్ని ప్రధాన ఆలయం వద్దకు చేర్చారు. 52 అడుగుల భారీ రథం లాగడంలో భక్తులు పోటీ పడ్డారు. శుక్రవారం రథయాత్ర ముగుస్తుంది. యాత్ర వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో వి.రాధాకృష్ణ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

వాహన తనిఖీలు



వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

భామిని: మండలంలోని బత్తిలి బస్టాండ్‌లో ఎస్ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు గురువారం నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మద్యం మత్తు దారులకు హెచ్చరికలు చేశారు. పలువురికి అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు దావాల రమణారావు కోరారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు అందించే మెను పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్సు యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ, బి.అమరవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి గణాంకాలు దోహదం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జనార్దననాయుడు

పాలకొండ రూరల్ : గణాంకాలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంతగానో దోహదపడతాయని పాలకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు అన్నారు. జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అర్థశాస్త్రం, గణిత శాస్త్రాల ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, బి.రాజు, అధ్యాపకులు సీహెచ్ రాఘవేంద్రనాయుడు, బీజే మణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాజాం : పట్టణంలోని దోలపేటకు చెందిన సాకేటి సత్యనారాయణ మాస్టార్‌ను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన ఇంటి వద్ద కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, పిట్టా జగదీష్ తదితరులు ఉన్నారు.



సభలో ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి (ఫైల్)

వైఎస్సార్‌సీపీలో ఉత్సాహం

- సీఎం జగన్ సభ సక్సెస్‌తో శ్రేణుల సంబరాలు

కురుపాం: అమ్మ ఒడి పథకం నాలుగో విడత నిధుల విడుదల కోసం చినమేరంగికి బుధవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ సక్సెస్ కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనబడుతుంది. సభకు అంచనాలకు మించి ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడంతో పాటు పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన్యం ప్రజలకు కావాల్సిన వరాలు ప్రకటించడంతో ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ ప్రాంతంపై ఎవరూ అడగకుండానే వరాల జల్లు కురిపించి కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్తేజం నింపారు. జగనన్న చెబితే చేస్తాడంతే.. అంటూ నమ్మకాన్ని నింపుకుంటున్నారు. ఈ సభలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కురుపాం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి సభాముఖంగా తీసుకువెళ్లడంతో సీఎం వరాల జల్లు కురుపించారు. కురుపాంకు మెడికల్ కళాశాల మంజూరు చేసినట్లు ప్రకటించారు. గడిచిన నాలుగేళ్లలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు, రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ పథకాలను అందించారు. కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తన ప్రసంగంలో నియోజకవర్గంలోని గుమ్మిడిగెడ్డపై మినీ రిజర్వాయర్(సింగుపురం)వద్ద నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేయాలని, తోటపల్లి – గుణుపూరు రహదారి పరిధిలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఎడమ కాలువపై ఉన్న శిథిల వంతెన నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరు చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలంలోని జంఝావతి కాలువ 21 ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో ఉల్లిభద్ర సమీపంలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేయాలని, ఐటీడీఏ పరిధిలో 66వేల ఎకరాల్లో గిరిజన రైతులు సాగు చేస్తూ జీడి తోటలపై ఆధారపడుతుండటంతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గుమ్మలక్ష్మీపురంలో మహిళా సంఘాల సభ్యులతో జీడి పరిశ్రమ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా పై సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు సభాముఖంగా హామీ ఇచ్చారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే... చేస్తాడంతే అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అశేష జన వాహిని

జగన్‌మోహన్‌రెడ్డి సభకు లెక్కకు మించి జనం హాజరు కావడంతో పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగి తేలుతున్నాయి. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం కావడం ఖాయమని సంబరపడుతున్నారు. అమ్మ ఒడి సభ పార్టీకి నూతనోత్తేజం ఇస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సీఎం దృష్టికి భామిని సమస్యలు



సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింహాచలం

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా చినమేరంగికి బుధవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భామిని మండల సమస్యలను తీసుకువెళ్లినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు తోట సింహాచలం గురువారం తెలిపారు. భామినిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, ఏబీ రోడ్డు పనులు మధ్యలో ఆపేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, నేరడి బీ, కాట్రగడ బీ, బాలేరు గ్రామాల వద్ద వంశధార నదిపై ప్రతిపాదించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. వంశధార ప్రాజెక్టు పనుల్లో బాలేరు గ్రామానికి వచ్చే గెడ్డ దారి మళ్లిందని, దాన్ని యధావిధిగా బాలేరు చెరువులకు నీరు అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్టు పేర్కొన్నారు.

అక్షరబ్రహ్మ ఆలయం ప్రారంభం



కారిగూడలో అక్షరబ్రహ్మ దేవాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: కారిగూడలోని అక్షరబ్రహ్మ దేవాలయాన్ని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్షరాలే దైవాలుగా పూజించడం అనాదిగా వస్తుందన్నారు. అక్షరంలోనే ఆదివాసీలు దైవాన్ని చూస్తారన్నారు. లిపికి పూజ చేస్తే సకల దేవతలకు పూజించినట్టేనన్నారు. మంగయ్య గొమాంగో పదేళ్ల పాటు కష్టపడి 1936లో సవరభాషకు లిపి తయారు చేయడం జరిగిందన్నారు. ఆయన కృషి శ్లాఘనీయమన్నారు. ఈ లిపిలో 24 అక్షరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి



జేకే పాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న రేంజర్ ఏడు కొండలు

- కురుపాం రేంజర్ ఏడుకొండలు

గుమ్మలక్ష్మీపురం: అడవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కురుపాం రేంజర్ పి.ఏడుకొండలు అన్నారు. గుమ్మలక్ష్మీపురం అటవీశాఖ పరిధిలోని (ఎల్విన్‌పేట బీట్) జేకే పాడు వన సంరక్షణ సమితికి చెందిన అటవీ ప్రాంతంలోని మొక్కలు, చెట్లను ఇటీవల తోలుఖర్జ, మంగళాపురం తదితర గ్రామాలకు చెందిన సుమారు 150 మంది గిరిజనులు ఇళ్లస్థలాల కోసం అనుకూలంగా తొలగించారు. దీంతో జే.కే పాడు వన సంరక్షణ సమితికి చెందిన గిరిజనులు ఆ అటవీ ప్రదేశం తమ గ్రామానికి (రెవిన్యూ పరిధిలో ఉందని) చెందినదని, దానిపై పూర్తి హక్కులు తమకే ఉందంటూ వారితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల గిరిజనులతో ఆయన జేకే పాడు గ్రామంలో గురువారం సమావేశమయ్యారు. ఈ అటవీ ప్రాంతం అటవీ శాఖ ఆధీనంలో ఉందని ఆయన చెప్పారు. దీన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. అటవీ ప్రాంతాన్ని ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ ఎస్.భాస్కరరావు, బీట్ ఆఫీసర్లు తిరుమల, రామారావు, చెముడుగూడ ఎంపీటీసీ మండంగి రమణ, సీపీఎం నాయకులు కోలక అవినాష్, ఎల్విన్‌పేట మాజీ ఎంపీటీసీ బిడ్డిక చంద్రమ్మ, వార్డు సభ్యులు నాగేశ్వరరావు తదితరులున్నారు.

రూ.2లక్షల వసూలు

కురుపాం రేంజ్ పరిధిలో కలప అక్రమ రవాణాదారుల నుంచి రూ.2లక్షలు సీఫీజ్‌ను వసూలు చేసినట్లు కురుపాం రేంజర్ పి.ఏడుకొండలు తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు కలప అక్రమ రవాణాదారులైన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

గిరిజనుల మధ్య చిచ్చు పెట్టడం తగదు

గుమ్మలక్ష్మీపురం: ఇళ్ల స్థలాల పేరుతో గిరిజనుల మధ్య చిచ్చుపెట్టడం సరికాదని సీపీఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ అన్నారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం అటవీ శాఖకు చెందిన ఎల్విన్‌పేట బీట్ (జే.కే పాడు వన సంరక్షణ సమితి)లోని అటవీ ప్రాంతాన్ని తోలుఖర్జ, మంగళాపురం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ కొంత మంది గిరిజనేతరులు వారిచే ఆ అటవీ ప్రాంతం ఆక్రమించుకునేలా ప్రోత్సాహించారని చెప్పారు. ఆ అటవీ ప్రాంతంపై హక్కులున్న జేకే పాడు, ఎస్‌కే పాడు, జేకే పాడు కాలనీ, ఎల్విన్‌పేట గ్రామాలకు చెందిన గిరిజనులతో గొడవలకు దించి చిచ్చు పెడుతుండడం హేయమైన చర్య అన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పాలకొండ: నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం పది గంటలకు జరగనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు గురువారం తెలిపారు. అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



పారిశుద్ధ్య పనుల్లో కార్మికులు

వంగర: మండల పరిధి తలగాంలో మా ఊరు – మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా మూడో రోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మురుగునీటిని తొలిగించి శుభ్రపరిచారు. సర్పంచ్ సంకిలి రాధ, పంచాయతీ కార్యదర్శి దేవరాజ్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన వేణుగోలస్వామి ఆలయప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో ఆలయప్రధాన అర్చకుడు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి



బాధితురాలికి రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ నగర పంచాయతీలోని 16వ వార్డుకు చెందిన ఆడంగి గాయత్రికి రూ.2 లక్షల సీఎం సహాయనిధి చెక్‌ను ఎమ్మెల్యే కళావతి గురువారం వండవ క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఈమె భర్త ఆడంగి కిషోర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఈ కుటుంబ ఆర్థిక పరిస్థితులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కళావతికి తెలియజేశారు. వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే కళావతి వీరి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ నుండి ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని మృతుని భార్య గాయత్రికి అందజేశారు. వీరితో పాటు వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడెం విజయ్‌కుమార్, తుమ్మగుంట శంకరరావు, కడగల రమణ తదితరులు ఉన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం



కోట అజేయ్‌కుమార్ | కోడెం విజయ్‌కుమార్ | దిబ్బ లలితకుమారి | గేదల కోటేశ్వరరావు | కొత్తకోట చంద్రశేఖర్



సువ్వాన నాగభూషణరావు | గోరిశెట్టి జనార్థన | ఏగిరెడ్డి సింహాచలం | పల్ల అనంతనాయుడు | బానాల సురేష్

పాలకొండ రూరల్: జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను వైఎస్సార్‌సీపీ గురువారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అన్ని మండలాలకు వీరిని నియమించారు. వీరు తమ పరిధిలోని మండలాల, వార్డు పరిధిలో సచివాలయాల ద్వారా అనుసంధానంగా ఉన్న గృహ సారధులు, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాల్సి ఉంటుంది. పాలకొండ మండలానికి కోట అజయ్‌కుమార్, నగర పంచాయతీకి కోడెం విజయ్‌కుమార్, వీరఘట్టం మండలానికి దిబ్బ లలితకుమారి, సీతంపేటకు గేదల కోటేశ్వరరావు, భామిని మండలానికి కొత్తకోట చంద్రశేఖర్ నియమితులయ్యారు.

కురుపాం: జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను వైఎస్సార్‌సీపీ నియమించింది. కురుపాం మండలానికి సువ్వాన నాగభూషణరావు, గరుగుబిల్లికి బానాల సురేష్, జియ్యమ్మవలసకు పల్ల అనంతనాయుడు, కొమరాడ ఏగిరెడ్డి సింహాచలం, గుమ్మలక్ష్మీపురం మండలానికి గోరిశెట్టి జనార్దన నియమితులయ్యారు.

ఉచిత కుట్టు శిక్షణ

భామిని: మండల కేంద్రంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు 90524 24881 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఆపదలో అండగా...



ఆర్థిక సాయం అందజేత

గరుగుబిల్లి: ఆపదలో వున్న కుటుంబాన్ని ఆదుకొనేందుకు భీమునిపట్నంలో డైట్ చదువుకున్న 1995 – 96 డైట్ బ్యాచ్ ఉపాధ్యాయులు తమవంతుగా ఆదుకొన్నారు. ఇందులో భాగంగా సీతానగరం మండలం బల్ల కృష్ణాపురానికి చెందిన తాలబత్తుల శ్రీనివాసరావు డైట్ కళాశాలలో కాలేజీ మీట్. ఇటీవల ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా మక్కువ మండలం గోపాలపురంలో పోస్టింగ్ వచ్చింది. అయితే ఉద్యోగంలో జాయిన్ కావడానికి ముందు రోజే ఈ నెల 25న గుండె పోటుతో మరణించారు. ఈ మేరకు భీమునిపట్నం డైట్ బ్యాచ్‌లో వున్న జీసీడీఓ కర్రి రోజారమణి, మండల ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, జి.చంద్రశేఖరరావు, కె.సురేష్‌లు రూ.78వేలు పోగు చేసి ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



దోమల నివారణకు ఇళ్లల్లో స్ప్రేయింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కడియం చిరంజీవి అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జంపరకోట గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమ తెరల వాడకంపై అవగాహన కల్పించారు. దోమల వలన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని, వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.భూలక్ష్మి, ఎస్.ప్రసాద్, వైద్య సిబ్బంది మోహనరావు, భువనేష, టి.రామలక్ష్మి, పెంటయ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో గరుగుబిల్లి మండల ఏపీసీఎన్ఎఫ్ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు తమ సొంత క్షేత్రంలో పంటల నమూనాలు వేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ గ్రామంలోని రైతులకు ఆదర్శంగా నిలవాలన్నారు. శ్రీవరి, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలు వేసుకోవడం వల్ల జీవ వైవిధ్యం సాధించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునన్నారు. కార్యక్రమంలో జట్టు కోఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు, కోర్ కార్బన్, ఎక్స్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్, జిల్లా కోఆర్డినేటర్ వి.గౌరీశంకరరావు, ఎస్ఎఫ్ఎఫ్ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ వి.పోలినాయుడు, ధనుంజయరావు పాల్గొన్నారు.

చేయిచేయి కలిపారు...



బావి వద్ద శ్రమదానం చేస్తున్న తల్లిదండ్రులు

సీతంపేట: ఓంద్రుజోల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల తల్లిదండ్రులు చేయిచేయి కలిపి మంచినీటి బావిని బాగు చేసి తాగునీటి సౌకర్యం విద్యార్థులకు కల్పించారు. కొన్ని సంవత్సరాలుగా బావిలో మురుగు చేరి నీరు లేని స్థితిలో పాడుబడి ఉంది. దీంతో ఇటీవల జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో హెచ్ఎం శ్రీదేవి తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లారు. తలో కొంత మొత్తం డబ్బులు ఎత్తుకుని విరాళంగా రూ.5 వేల వరకు సమకూర్చారు. ఈ నిధులతో మోటార్ పెట్టి మురుగునీరు తోడి వేశారు. పూడికపోయిన మట్టిని శ్రమదానంతో తీసివేశారు. పరిసరాల్లో ఉన్న మొక్కల్ని తొలగించారు. బావిని అందుబాటులోకి తెచ్చారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధి మందులు అందజేస్తున్న మండల వ్యవసాయాధికారులు

భామిని: మండలంలోని పాలవరం గిరిజన గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె.సింహచలం వైఎస్సార్ పొలంబడి గురువారం నిర్వహించి గిరిజనులకు వ్యవసాయ సూచనలు చేశారు. ప్రధానంగా విత్తనాలు వేసే ముందు విత్తన శుద్ధి చేసుకుంటే మొలకల శాతం పెరుగుతుందని, భూమిలో వ్యాపించే తెగుళ్ల అరికట్టవచ్చని తెలిపారు. ఎరువులు, క్రిమి సంహారాలపై వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం విత్తనశుద్ధికి ఉపయోగించే సూడోమోనస్ మందు ప్యాకెట్లు పంపిణీ చేశారు. విత్తనశుద్ధిని ప్రయోగాత్మకంగా చేపట్టి చూపించారు. పెద్దదిమిలి, ఘనసర వ్యవసాయ సహాయకులు భవానీ, గొర్లె ఎలీసాలు సహకరించారు. గిరిజన రైతులు, ప్రకృతి సాగు సిబ్బంది పాల్గొన్నారు.